

## నేటి నుంచి హన్మాన్ చిన్నజయంత్యుత్సవాలు

- తరలిరానున్న లక్షలాదిగా అంజన్న మాలధారులు

మల్యాల, ఏప్రిల్ 21 : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నేటి నుంచి మూడు రోజులపాటు హన్మాన్ చిన్న జయంత్యుత్సవాలు జరుగనున్నాయి. ఈనెల 23న చిన్న హనుమన్ జయంతి నేపథ్యంలో 24 వరకు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కొండగట్టులో ఆంజనేయ స్వామికి రెండు జయంతులు నిర్వహిస్తారు. సీసీ కెమెరాల ద్వారా ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. 35 ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. 76 శాశ్వత ప్రాతిపాదికన ఉండగా మరో 58 తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించారు. నూతన పుష్కరిణి వద్ద మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులను నిర్మించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బందోబస్తు, చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. భక్తుల కోసం 3 లక్షల లడ్డూలను తయారుచేసి పెట్టారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఏఈ లక్ష్మణ్ రావు మల్యాల సీఐ నీలం రవి, ఎస్ఐలు అబ్దుల్ రహీం, కందుకూరి కుమారస్వామి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కాగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ దివాకర పేర్కొన్నారు. గుట్ట మీద ఉన్న 4లక్షల నీటి ట్యాంకును నింపి సిద్ధంగా ఉంచామని తెలిపారు.



కొండగట్టులో జయంతి ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ దివాకర

## 'దివ్య'మైన ఆశీర్వాదం

- మూగ జంట వివాహానికి 100 మంది దివ్యాంగుల హాజరు



బండలింగాపూర్‌లో దివ్యాంగ జంటను ఆశీర్వదించేందుకు హాజరైన దివ్యాంగులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 21: వివాహ బంధంతో ఏకమైన ఆ మూగ జంటను ఏకంగా 100 మంది దివ్యాంగులు ఆశీర్వదించారు. అంతకుముందు వివాహ వేడుకకు హాజరైన వీరు సందడి చేశారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌కు చెందిన వెంకట్‌రెడ్డి, గోదావరిఖనికి చెందిన స్వాతి పుట్టుకతోనే మూగవారు. ఆదివారం పెద్దల సమక్షంలో బండలింగాపూర్‌లో వీరి పెండ్లి తంతు ఘనంగా జరిగింది. అబ్బాయి, అమ్మాయి తరపున స్నేహితులైన సుమారు వంద మంది దివ్యాంగులు హాజరై ఆశీర్వదించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

### ఓటు హక్కు వినియోగంపై అవగాహన

కోరుట్ల, ఏప్రిల్ 21: పట్టణంలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం కలెక్టర్ సూచనలతో సీనియర్ సిటిజన్స్, పెన్షనర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ, 85 ఏళ్లు నిండిన వయోధికులతోపాటు 40శాతం పైబడి అంగవైకల్యం ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఫారం-12 డీ ద్వారా దరఖాస్తు చేసుకొని వంద శాతం ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి రాజ్‌మోహన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సైఫొద్దీన్, కోశాధికారి నల్ల లక్ష్మీనారాయణ, రాజయ్య, లక్ష్మీకాంతం, అల్లూరి బాపురెడ్డి, గంగారాం, శనిగరపు చిన్న మల్కయ్య, గోపం శ్రీరాములు, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'ధాన్యం కొనుగోలు చేస్తాం'

పెగడపల్లి , ఏప్రిల్ 21: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యంలో కోతలు విధించే రైస్ మిల్లర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పెగడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. బీజేపీ కేంద్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేమీ లేదని, తప్పుడు హామీలు గుప్పిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, వారికి ఓటు అడిగే హక్కు లేదని లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. ఇక్కడ నాయకులు రాములు గౌడ్, శోభారాణి, తదితరులున్నారు.

### సారంగాపూర్ ఇన్‌చార్జి ఎస్ఐగా గౌతమ్‌పవార్

సారంగాపూర్, ఏప్రిల్ 21 : సారంగాపూర్ ఎస్ఐగా బీర్‌పూర్ ఎస్ఐ గౌతమ్‌పవార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇటీవల సారంగాపూర్ స్టేషన్‌లో గంజాయి మాయమవడంపై ఇద్దరు ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బీర్‌పూర్ ఎస్ఐకి ఉన్నతాధికారులు సారంగాపూర్ ఎస్ఐగా బాధ్యతలు అప్పగించారు.

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- జాప్యంతో ధాన్యం దళారులపాలు

కొడిమ్యాల, ఏప్రిల్ 21 : ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి ధాన్యం దళారులపాలు అవుతోంది. కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 1 ,2 తేదీల్లో ప్రారంభించగా నాలుగు రోజుల నుంచి మండలంలోని అక్కడక్కడ నత్తనడకన ధాన్యం తూకం వేయడంతో రైతులు చూసి చూసి అకాల వర్షం భయంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన ఎలాంటి లైసెన్స్ లేని దళారులు ధాన్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని 24 గ్రామాలు ఉండగా 24 కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ ఒకటి రెండు తేదీల్లో ప్రారంభించారు. సెర్ప్ ఆధ్వర్యంలో 10, కొడిమ్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో 4, పూడూర్ సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలో 5, తిర్మలాపూర్ సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలో 5 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.




తిర్మలాపూర్ వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న దళారులు

#### సుల్తానాబాద్‌కు తరలింపు

మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఎలాంటి లైసెన్స్ లేని దళారులు ధాన్యాన్ని లారీలు, డీసీఎంలలో తరలిస్తున్నారు. కరీంనగర్, సుల్తానాబాద్, తదితర ప్రాంతాల్లో రైస్ మిల్లర్ల ద్వారా కమీషన్ మాట్లాడుకొని తరలిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి 2,203, బీ గ్రేడ్ రకానికి 2,183 ధర కల్పించగా దళారులు మాత్రం క్వింటాల్‌కు 1750, 1800 ధర నిర్ణయించి ధాన్యాన్ని తరలించడంతోపాటు, తూకం వేసే సమయంలో తప్ప తాలు, సంచి బరువు పేరుతో సంచికి రెండు కిలోల వడ్లు కటింగ్ పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నారు. కొన్ని గ్రామాల్లో మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని 2000 వేల ధర నిర్ణయించి తరలిస్తున్నారు.

#### తూకంలో జాప్యం

మండలంలోని 24 గ్రామాల్లో ఏప్రిల్ 1,2 తేదీల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఇప్పటివరకు ధాన్యం తూకం వేయడంతో ధాన్యాన్ని దళారుల పాలవుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వరి కోతలు 90 శాతం పూర్తి కాగా ఇప్పటివరకు ఏ గ్రామంలో కూడా ధాన్యాన్ని తూకం వేస్తలేరు. ఒక పక్క అకాల వర్షం భయం మరో పక్క వడ్లు బీట్లలో ఉండటంతో రైతులు చేసేదేమీలేక ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాం విక్రయిస్తున్నారు.

#### ధాన్యం తూకం త్వరగా వేయాలి

కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తీసుకొచ్చి ఇప్పటికే 25 రోజులు అయింది.



రైతులందరం ధాన్యాన్ని అరబెట్టి మ్యాచర్ వచ్చాక కుప్పలు పోసి రెడీగా ఉన్నాం. గ్రామంలో ధాన్యం కొనుగోలులో జాప్యంతో రైతులు చేసేదేమీ లేక దళారులకు విక్రయిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ధాన్యాన్ని త్వరగా తూకం వేయించాలి.

-రేకులపల్లి తిరుపతిరెడ్డి యువ రైతు అప్పారావుపేట

#### కొనుగోలు కేంద్రంలో తిప్పలైతంది



కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి 20 రోజులైంది. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రా లు ప్రారంభించలేదు. ధాన్యం అర బెట్టే సమయంలో కనీసం నీటి వసతి కూడా నిర్వాహకులు ఏర్పాటు చేయలేదు. 15 రోజుల నుంచి రోజూ సెంటర్‌కు పోవుడు ఇంటికి వచ్చుడు అయితాంది. నాయకులు తొందరగా ధాన్యా న్ని తూకం వేయించాలి. గతంలో ఎన్నడూ ఇన్ని రోజులు ఎదురు చూడలేదు.

-భూక్యా సుగుణ, గంగారాం తండా, రైతు

#### లైసెన్స్ లేని వ్యక్తులు ధాన్యం కొంటే చర్యలు

మండలంలోని ఏ గ్రామంలో అయినా లైసెన్స్ లేని వారు వరి ధాన్యం కొనుగోలు చేస్తే చర్యలు తప్పవు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి దళారులు ధాన్యం కొనటం నేరం. ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే మా దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-వరలక్ష్మి, మల్యాల మార్కెట్ కమిటీ కార్యదర్శి

## జగిత్యాల గాయకుడికి ఉగాది పురస్కారం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 21 : హైదరాబాద్‌లోని అద్వైత ఆర్ట్స్ అకాడమీ అధినేత సినీ జానపద గాయకుడు ప్రణయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందించారు. జగిత్యాల పట్టణానికి చెందిన జానపద గాయకుడు బానుక మహేశ్‌కు ఉగాది పురస్కారాన్ని సినీ జానపద గాయకులు ప్రణయ్‌కుమార్, దైవజ్ఞ శర్మ, టీవీ సీరియల్ నటుడు లోహిత్ అందించారు. 15 సంవత్సరాలుగా సింగాపూర్, మలేషియా లాంటి ఎన్నో దేశాల్లో జానపద ప్రదర్శనలిచ్చి గాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్న మహేశ్‌కు ఉగాది పురస్కారం అందించడంపై తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



ఉగాది పురస్కారాన్ని మహేశ్‌కు అందిస్తున్న అద్వైత ఆర్ట్స అకాడమీ సభ్యులు

### తడిసిన ధాన్యాన్ని కొనాలి

మెట్‌పల్లి, ఏప్రిల్ 21: ఇటీవల అకాల వర్షంతో తడిసిన వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఏఎంసీ మాజీ డైరెక్టర్ గాజె చిన్నరాజన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగంపల్లి సంజీవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెట్‌పల్లిలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ, వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏమైందని ప్రశ్నించారు. తక్షణమే వాటిని అమలు చేయాలని, అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందజేయాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలిపారు.



మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న కర్బూజ పంటను చూపుతున్న శ్రీనివాస్



ముత్యంపేటలోని తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న ఓ విద్యుత్ స్తంభానికి శ్రీనివాస్ అమర్చిన కెమెరా

# పంట క్షేత్రంపై నిఘా నేత్రం

- యువరైతు శ్రీనివాస్ ఆలోచన అదుర్స్
- పండ్లు, కూరగాయల తోటలో సోలార్ కెమెరా ఏర్పాటు
- పంటను కాపాడేందుకు వినూత్న ప్రయోగం

మల్లాపూర్, ఏప్రిల్ 21: పంటల సాగులో వినూత్న పద్ధతులు అవలంబిస్తున్న యువ రైతు.. చేతికొచ్చిన పంట ఉత్పత్తులను దొంగలు, జంతువుల బారి నుంచి కాపాడుకొనేందుకు ఇదే తరహాలో ముందుకుసాగుతున్నాడు. తన పంట క్షేత్రంలో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాడు. ప్రతినిత్యం పర్యవేక్షిస్తూ టెక్నాలజీ వినియోగంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు ముత్యంపేటకు చెందిన యువరైతు శ్రీనివాస్. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్‌కు గ్రామ శివారులో ఏడెకరాల సాగు భూమి ఉన్నది. ఇందులో ఐదు రకాల కర్బూజ (అరోహి, విశాల, జన్నాత్)తో పాటు, టమాట, సోరకాయ, బీరకాయ, వంకాయ, తదితర పంటలను సాగు చేస్తున్నాడు. అయితే పంటలు చేతికొచ్చే దశలో తరచూ అడవి జంతువులు, జీవరాశుల బెడద, పండ్ల దొంగతనాలు జరుగుతుండేవి. దీంతో తనకు తెలిసిన ఓ కెమెరా టెక్నీషియన్‌ను సంప్రదించి రూ.9 వేల ఖర్చుతో వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఓ విద్యుత్ స్తంభంపై భాగాన సోలార్ కెమెరాను అమర్చాడు. దీనిని తన ఫోన్‌కు అనుసంధానం చేసుకున్నాడు. దీంతో రాత్రివేళల్లో కెమెరా తనక్షేత్రం చుట్టూ తిరుగుతూ ఏదైన జంతువులు, మనుషులు వస్తే ఒక్కసారిగా సోలార్ కెమెరా ద్వారా లైట్లు వెలుగుతాయి, సైరన్ మోగుతుంది. ఫోన్‌కు సైతం నోటిఫికేషన్ వచ్చి తోటలో ఉన్న ఎవరైనా వ్యక్తులు, జంతువులను చూడటంతోపాటు, టూ వే టాక్ పద్ధతిన మాట్లాడవచ్చు. దీంతో వచ్చిన వారు భయపడి పారిపోయే పరిస్థితి ఉంటుంది.

## తలంబ్రాల బుకింగ్ గడువు పొడిగింపు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 21: టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ గడువును ఈ నెల 25వరకు పొడిగించారని కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్ ఏటీఎం సదాశివ్ శనివారం తెలిపారు. భక్తులు తలంబ్రాల కోసం లాజిస్టిక్ కౌంటర్లు, ఆన్‌లైన్, ఏజెం ట్ల వద్ద రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. బుకింగ్ చేసుకున్న భక్తులకు ఈనెల 28తర్వాత వారు ఇచ్చిన చిరునామాకు తలంబ్రాల ప్యాకెట్లను ఏజెంట్ల ద్వారా పంపించనున్నట్లు తెలిపా రు. కాగా, కరీంనగర్ రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు 2వేల మంది తలంబ్రాలను బుకింగ్ చేసుకున్నట్లు వెల్లడించారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

సారంగాపూర్, ఏప్రిల్ 21 : బీర్‌పూర్ నాయకపు గూడెంలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బద్ది లింగన్న గుడిసె దగ్ధం అయ్యింది. ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో గుడిసెకు నిప్పంటుకుంది. గూడెం వాసులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచార మివ్వగా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోనరావుపేట, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు (2001-02లో ఎస్సెస్సీ బ్యాచ్) సమావేశమయ్యారు. తరగతి గదుల్లో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు.

కోనరావుపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## 'వినోద్' రోడ్‌షోను విజయవంతం చేయాలి



మల్యాలలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి

మల్యాల, ఏప్రిల్ 21 : మల్యాల మండల కేంద్రంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సోమవారం నిర్వహిస్తున్న రోడ్‌షోకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం మల్యాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొండపలుకుల రామ్మోహన్‌రావు, నాయకులు జనగం శ్రీనివాస్, మధుసూదన్‌రావు, సాగర్‌రావు, తిరుపతి రెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## 20 మంది పేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 21 : పావని కంటి దవాఖాన ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 20 మంది పేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం ఉచిత కంటి శస్త్రచికిత్స చేశారు. అనంతరం వారికి ఉచిత కళ్లద్దాలు, మందు లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, మాజీ సర్పంచ్ రమణారావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ తిరుపతిగౌడ్, దవాఖాన సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

#### అనారోగ్య బాధితులకు పరామర్శ

సారంగాపూర్, ఏప్రిల్ 21 : మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొలగాని సురేష్ తల్లి రాధ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనుపురం రాములు ప్రమాదవశాత్తు గాయపడగా పరామర్శించారు. అలాగే, శ్రీఆంజనేయ సహిత శివపంచాయతన ప్రాణప్రతిష్ఠ వేడుకలు, మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమాల్లో నాయకుడు రమణారావు, ఆకుల తిరుపతి, అనంతుల గంగారెడ్డి, తేలు రాజు, మల్లేశ్, అరవింద్, శ్రీహరి, రాంబాబు, అలీం, శేఖర్, రాజేశం పాల్గొన్నారు.

## ఫ్లయింగ్ స్క్వాడ్ వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

కథలాపూర్, ఏప్రిల్ 21 : కోరుట్ల-వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం పోసానిపేట శివారులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారులు ఆదివారం ప్రత్యేక తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా సోదా చేసి వదిలిపెట్టారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ఎక్కువ డబ్బులు, మద్యం తరలిస్తే కఠిన చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శ్రీనివాస్, రాజు ఉన్నారు.



గోవిందరావుపేటతండాలోని కేంద్రంలో ధాన్యాన్ని సంచుల్లో నింపుతున్న మహిళా రైతులు

# రైతులే.. హమాలీలుగా

- పురుషులతో సమానంగా వడ్లు కాంటా వేస్తున్న మహిళా రైతులు

వారంతా మహిళా రైతులు. ఈ వేసవిలో వారికి ఉపాధి కరువు కావడం.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసేవారు లేకపోవడంతో హమాలీలుగా మారారు. వారు పండించిన ధాన్యాన్ని వారే తూకం వేస్తున్నారు. ధాన్యం తూకం వేయడంలో పురుషులతోపాటు మహిళలు సమానంగా పనిచేస్తున్నారు. ధాన్యం బస్తాలను నింపడంతో పాటు లారీల్లో లోడ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాలో సింగిల్‌విండో పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం పోసేందుకు స్థలం లేకపోవడంతో ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడే ధాన్యం పోశారు. తేమశాతం వచ్చిన కూడా హమాలీలు లేక కొనుగోలు ప్రక్రియ ప్రారంభంకాలేదు. ఈ క్రమంలో తండావాసులకు ఉపాధి లేకపోవడం, హమాలీలు రాకపోవడంతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని వారే తూకం వేస్తున్నారు. కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరు కలిసి కాంటా చేయడానికి రాగా, ఒకరి తర్వాత ఒకరు ధాన్యాన్ని తూకం వేసి లారీల్లో తరలిస్తున్నారు. - కోనరావుపేట, ఏప్రిల్ 21